APTEL/2015/65279

Postal Reg.No. MPM/L22/VNEWS/22-24




# V న్యూస్

మన ఊరు - మన వార్తలు

తెలుగు దినపత్రిక

e-mail : vnewsmachilipatnam@gmail.com
e-mail : vnewsindia@gmail.com




సంపుటి :9 సంచిక : 195 మచిలీపట్నం, విజయవాడ, కాకినాడ, గుంటూరు, ఖమ్మం, వైఎస్ఆర్ కడప, ఒంగోలు, పొట్టి శ్రీరాములు నెల్లూరు 20-12-2022 మంగళవారం పేజీలు :4 వెల : రూ.3/-










# నార్కొటిక్స్ రహిత రాష్ట్రంగా ఏపీ మారాలి: సీఎం జగన్

**అమరావతి :** రాష్ట్రంలో ఎక్సైజ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పనితీరు పైన సోమవారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. నార్కొటిక్స్ రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మారాలని ఈ సమావేశంలో ఆయన ఆకాంక్షించారు. ఎక్కడా మాదక ద్రవ్యాలు వినియోగం ఉండొద్దు.. ఆ లక్ష్యంతోనే పని చేయాలంటూ పోలీస్, ఎక్సైజ్ శాఖలు కలిసి పని చేయాలంటూ ఆయన సూచించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్న ఆయన.. పలు కీలక సూచనలు చేశారు.

ఎస్ఈబీ సమీక్ష సందర్భంగా.. నార్కొటిక్స్‌తో పాటు అక్రమ మద్యాన్ని పూర్తిగా అరికట్టడం, మరింత సమన్వయంతో సచివాలయాల్లోని మహిళా పోలీస్‌ల పనితీరును మెరుగుపర్చడం, దిశ చట్టం.. యాప్‌లను మరింత పక్కాగా అమలు చేసేలా చూడడం.. ఈ నాలుగింటిపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం జగన్‌హొఆదేశించారు. అలాగే.. రాష్ట్రాన్ని నార్కొటిక్స్ రహిత ప్రాంతంగా తీర్చి దిద్దడంలో ఎక్సైజ్, ఎస్ఈబీ అధికారులతో పోలీస్ శాఖ మరింత సమన్వయంతో పని చేయాలని కోరారు. అదే విధంగా దిశ యాప్ వినియోగం, కాల్స్, వేగంగా స్పందించడం వంటి వాటిపై అన్ని చోట్లా మాక్ డ్రిల్స్ నిర్వహించాలని సీఎం జగన్ సూచించారు.

**ఇకపై వారంలో రెండు సమావేశాలు**

మరింత సమర్థవంతంగా పని చేసేందుకు ప్రతి మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించాలని సీఎం జగన్ ఆదేశించారు. అక్రమ మద్యం నియంత్రణ దిశలో ఎస్ఈబీ, ఎక్సైజ్ అధికారులు తీసుకున్న చర్యలు, గంజాయిసాగు అరికట్టడంపై సమీక్షించాలన్నారు. అలాగే.. ప్రతి గురువారం పోలీస్ ఉన్నతాధికారులు సమావేశం కావాలన్నారు. జిల్లా ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి.. నార్కొటిక్స్, అక్రమ మద్యాన్ని అరి కట్టడం, సచివాలయాల మహిళా పోలీసులతో సమన్వయం, దిశ చట్టం, యాప్ ఇంకా సమర్థ వినియోగంపై సమీక్షించాలని, ఇక నుంచి ఇవన్నీ రెగ్యులర్‌గా జరగాలని సీఎం జగన్ అధికారులకు స్పష్టం చేశారు.

**కాలేజీలు, వర్సిటీల్లో ప్రచారం**

ఎస్ఈబీ టోల్‌ఫ్రీ నెంబర్.. 14500తో పాటు, నార్కొటిక్స్ నియంత్రణపై అన్ని కాలేజీలు, యూనివర్సిటీల వద్ద పెద్ద హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలని,



విద్యార్థులు నార్కొటిక్స్ వినియోగించకుండా అరికట్టాలని సీఎం జగన్ కోరారు. వచ్చే మూడు, నాలుగు నెలల్లో నార్కొటిక్స్ రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చి దిద్దాలని ఆయన ఆకాంక్షించారు. అదే లక్ష్యంతో పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు పని చేయాలని కోరారు. మన యూనివర్సిటీలు, కాలేజీలు.. అన్నీ జీరో నార్కొటిక్స్‌గా ఉండాలి. అదే ఆయా శాఖల లక్ష్యం కావాలి. ఇందు కోసం నెల రోజుల్లో అన్ని కాలేజీలు, వర్సిటీల్లో హోర్డింగ్‌ల ఏర్పాటు పూర్తి కావాలి అని చెప్పారు.

**పటిష్టం చేయండి**

మహిళా పోలీసులు, దిశ చట్టం, యాప్‌ను ఇంకా పటిష్టం చేయాలి. మహిళా పోలీసుల పనితీరు ఇంకా మెరుగుపర్చడంపై దృష్టి పెట్టాలి. రాష్ట్రంలో దాదాపు 15 వేల మంది మహిళా పోలీస్‌లు ఉన్నారు. ఇంకా దిశ చట్టాన్ని ఇంకా బాగా అమలు చేయాలి. యాప్ డౌన్‌లోడ్స్ పెరగాలి అని సీఎం జగన్.. సంబంధిత అధికారులకు తెలిపారు.

**ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలి:**

గంజాయిసాగుదార్లకు వ్యవసాయం, పాడి వంటి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపాలి. అప్పుడు వారికి శాశ్వత ఉపాధి కల్పించినట్లు కూడా అవుతుంది. గంజాయి సాగుదార్లను మార్చే విధంగా, 'ఆపరేషన్ పరివర్తన్' నిర్వహించాలని సీఎం జగన్ సూచించారు.

**ఎస్ఈబీ ఇంకా సమర్థంగా..**

అక్రమ మద్యం గురించి కానీ, పబ్లిక్ ప్లేసెస్‌లో మద్యపానం కానీ.. ఇసుక ఎక్కువ ధరకు అమ్మడం కానీ.. ఇలా దేనిపై ఫిర్యాదు వచ్చినా ఎస్ఈబీ అధికారులు

# ఏపీ విభజన హామీల అమల్లో కేంద్రం విఫలం: విజయసాయిరెడ్డి

**న్యూఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్ విభజన హామీల అమల్లో కేంద్రం ఘోరంగా విఫలమైందన్నారు వైఎస్ఆర్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి. ఈ విషయంలో కేంద్రం సవతి ప్రేమను చూపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం రాజ్యసభలో అప్రాప్రియేషన్ బిల్లు 2022పై జరిగిన చర్చలో మాట్లాడారు ఎంపీ విజయసాయిరెడ్డి. పోలవరం ప్రాజెక్టు అమలు లోపభూయిష్టంగా ఉందన్నారు.

'ఏపీ విభజన హామీల అమల్లో కేంద్రం విఫలమైంది. అన్ని అవకాశాలు ఉన్నా కేంద్రం దృష్టి పెట్టడం లేదు. ఆస్తుల పంపకం కోసం సుప్రీం కోర్టుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. పోలవరం ప్రాజెక్టు అమలు లోపభూయిష్టం. దీనికి యూపీఏ ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత. 2010-11 రేట్లతో 2022లో ప్రాజెక్ట్ కట్టమంటున్నారు. ఏ కాంట్రాక్టర్ ముందుకొస్తారు, నష్టాలు ఎవరు భరిస్తారు. ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రం సవతి ప్రేమ చూపించడం సరికాదు' అని ఆందోళన వ్యక్తం చేశారు వైఎస్ఆర్‌సీపీ ఎంపీ విజయసాయి రెడ్డి.

**పోలవరం పనుల సొమ్ము చెల్లింపుల్లో జాప్యం లేదు**

పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులకు వెచ్చిస్తున్న సొమ్మును కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు తిరిగి చెల్లిస్తోందని కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి శ్రీ బిశ్వేశ్వర్ తుడు పేర్కొన్నారు. రాజ్యసభలో సోమవారం వైఎస్సార్సీపీ సభ్యులు విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిచ్చారు. 2014 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది అక్టోబర్ వరకు పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం కోసం 15 వేల కోట్ల 970 లక్షల రూపాయలు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఈ మొత్తంలో ఆమోదయోగ్యమైనవిగా గుర్తించిన బిల్లులకు 13 వేల కోట్ల 226 కోట్ల రూపాయల చెల్లింపు జరిగిందన్నారు.

పోలవరం ప్రాజెక్ట్ పనుల బిల్లులను పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ (పీపీఏ), కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) తనిఖీ చేసి వాటి చెల్లింపుల కోసం సిఫార్సు చేసిన అనంతరం కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని వివరించారు. పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు ఆర్థిక శాఖ ద్వారా నిధులు మంజూరు చేయాలని 2016 సెప్టెంబర్ 30న ప్రభుత్వం నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. అయితే ఆఫీసు మెమోరాండం ప్రకారం కేంద్ర ప్రభుత్వం 2014 ఏప్రిల్ 1 నుంచి కేవలం ఇరిగేషన్ కాంపోనెంట్ కింద అయిన ఖర్చు మాత్రమే భర్తీ చేయాల్సి ఉందని అన్నారు. ఆ ఖర్చును



సమయానుసారం భర్తీ చేస్తున్నట్లు తెలిపారు.

**ఇథనాల్ స్టాకు పెంపు నిరంతర ప్రక్రియ**

పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ మిశ్రమం చేయవలసిన ఆవశ్యకత దృష్ట్యా దేశవ్యాప్తంగా ఇథనాల్ నిల్వల సామర్థ్యం పెంపు అనేది ఒక నిరంతరం ప్రక్రియ అని కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి శ్రీ రామేశ్వర్ తేలి వెల్లడించారు. రాజ్యసభలో సోమవారం వైఎస్సార్సీపీ సభ్యులు విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిస్తూ ఈ విషయం తెలిపారు. 2020-21లో దేశీయ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు) పెట్రోల్‌లో 10 శాతం ఇథనాల్ మిశ్రమం చేసినట్లు చెప్పారు. ఆయిల్ రిఫైనరీలు, టెర్మినల్స్, సప్లయర్ల వద్ద ఇథనాల్‌ను నిల్వ చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా ఇథనాల్ నిల్వ చేసేందుకు అవసరమైన ఏర్పాటు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు.

# తెలుగు రాష్ట్రాల అప్పుల వివరాలు బయటపెట్టిన కేంద్రం

**ఢిల్లీ :** తెలుగు రాష్ట్రాల్లో అప్పుల భారం పెరుగుతోందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రాల్లో అప్పులపై భారాస ఎంపీలు లోక్‌సభలో అడిగిన ప్రశ్నలకు కేంద్రం సమాధానమిచ్చింది. దేశంలోని రాష్ట్రాల వారీగా అప్పుల జాబితాను కేంద్రం బయటపెట్టింది. ఏపీలో ఏటేటా అప్పులు భారీగా పెరిగినట్టు పేర్కొంది. బడ్జెట్ లెక్కల ప్రకారం 2018లో ఏపీ అప్పు రూ. 2.29లక్షల కోట్లుగా ఉండగా.. ప్రస్తుతం ఆ రుణం రూ. 3.98లక్షల కోట్లకు చేరిందని కేంద్ర ఆర్థికశాఖ వెల్లడించింది. అదే 2017-18లో గతంతో పోలిస్తే 9.8శాతం అప్పులు తగ్గాయని కేంద్రం పేర్కొంది. 2020-21 నాటికి అప్పులు 17.1శాతం పెరుగుదల నమోదైనట్టు తెలిపింది. ఏపీ జీడీపీలోనూ మూడేళ్లుగా అప్పుల శాతం పెరిగినట్టు వెల్లడించింది. 2014లో రాష్ట్ర జీడీపీలో అప్పుల శాతం 42.3శాతంగా ఉన్నట్టు పేర్కొన్న కేంద్ర ఆర్థికశాఖ.. 2014 తర్వాత రాష్ట్ర జీడీపీలో అప్పుల శాతం తగ్గిందని తెలిపింది. 2015లో



రాష్ట్ర జీడీపీలో 23.3శాతం అప్పులు ఉండగా.. 2021 నాటికి అది 36.5శాతానికి పెరిగినట్టు వెల్లడించింది.

**తెలంగాణలో ఇలా..**

మరోవైపు, తెలంగాణలోనూ అప్పుల భారం పెరుగుతోందని తెలిపింది. 2018లో రూ. 1.60లక్షల కోట్లుగా ఉన్న అప్పులు 2022 నాటికి రూ. 3.12లక్షల కోట్లకు చేరాయంది. 2017-18లోనే 95.9 శాతం అప్పులు నమోదైనట్టు తెలిపింది. 2017-18 నాటికి గతంతో పోలిస్తే 18.7 శాతం అప్పులుంటే.. 2021-22నాటికి 16.7 శాతంగా ఉన్నట్టు స్పష్టంచేసింది. రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తిలోనూ గత మూడేళ్లుగా అప్పుల శాతం పెరుగుతూ పోతోందని కేంద్రం తెలిపింది. 2016లో రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తిలో అప్పుల శాతం 15.7 ఉండగా ఆ తరువాత భారీగా పెరుగుదల నమోదైనట్టు వెల్లడించింది. 2022 నాటికి తెలంగాణ రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తిలో 27.4 శాతం అప్పులు నమోదయ్యాయి.

# 4 అమెరికా క్షిపణులను కూల్చేశాం.. రష్యా కీలక ప్రకటన

**రష్యా:** ఉక్రెయిన్ పై దండయాత్ర సాగిస్తోన్న రష్యా సోమవారం కీలక ప్రకటన చేసింది. దక్షిణ రష్యా ప్రాంతంలోని ఉక్రెయిన్ సరిహద్దుల్లో నాలుగు క్షిపణులను తమ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ కూల్చివేసినట్లు వెల్లడించింది. ఈ క్షిపణులు అమెరికా లో తయారైనట్లు తెలిపింది. 10 నెలలుగా సాగుతోన్న ఈ యుద్ధంలో క్షిపణుల కూల్చివేత గురించి రష్యా ఇలాంటి ప్రకటన చేయడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.



బెల్‌గొరాడ్ ప్రాంతంలో గగనతలంలోకి దూసుకొచ్చిన నాలుగు అమెరికన్ 'హెచ్ఏఆర్ఎం' యాంటీ రాడార్ క్షిపణులను కూల్చివేసినట్లు రష్యా రక్షణశాఖ సోమవారం సోషల్‌మీడియా వేదికగా వెల్లడించింది. ఈ నగరంపై ఉక్రెయిన్ బలగాలు దాడి చేస్తున్నట్లు రష్యా కొంతకాలంగా ఆరోపిస్తోంది. ఆదివారం కూడా ఈ నగరంపై కీవ్ సేనలు దాడి చేసినట్లు బెల్‌గొరాడ్ ప్రాంత గవర్నర్ ఆరోపించారు.హొ

కాగా.. రష్యా సైనిక చర్య మొదలైన తర్వాత నుంచి ఉక్రెయిన్‌కు అమెరికా భారీగా ఆయుధ సాయం చేస్తోన్న విషయం తెలిసిందే. ఆర్టిలరీ గన్స్, గగనతల రక్షణ వ్యవస్థలతో పాటు క్షిపణి వ్యవస్థలను అందించింది. ఇదిలా ఉండగా.. ఉక్రెయిన్‌పై రష్యా మళ్లీ దూకుడు పెంచింది. రాజధాని కీవ్ సహా ప్రధాన నగరాలపై రాకెట్లు, బాంబుల వర్షం కురిపిస్తోంది. కీవ్ పైన డ్రోన్లతో దాడిచేసింది. ఉక్రెయిన్ బలగాల ఎదురుదాడులతో ఇటీవల ఖేర్సన్ నుంచి వెనక్కి వెళ్లిపోయిన మాస్కో.. తాజాగా ఆ నగరంపై విరుచుకుపడింది. ఆదివారం ఒక్కరోజే 54 దాడులకు పాల్పడింది.

# 'కిసాన్ గర్జన' సభకు హాజరైన అమరావతి రైతులు



**ఢిల్లీ :** ఏపీ రాజధానిగా అమరావతినే కొనసాగించాలంటూ ఆ ప్రాంత రైతులు ఢిల్లీలో కొనసాగిస్తున్న నిరసనలు మూడోరోజుకు చేరుకున్నాయి. రాంలీలా మైదానంలో భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'కిసాన్ గర్జన' సభకు అమరావతి రైతులు హాజరయ్యారు. పెద్ద ఎత్తున రాజధాని ప్రాంత రైతులు, మహిళలు ఈ సభలో పాల్గొన్నారు. అమరావతి నిర్మాణానికి భూములు ఇచ్చిన విధానం.. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన అన్యాయాన్ని అమరావతి ఐకాస నేతలు ఈ సభలో వివరించనున్నారు. అమరావతి ఉద్యమానికి మద్దతుగా నిలవాలని భారతీయ కిసాన్ సంఘ్ నేతలను కోరనున్నారు.

# అర్థం లేనితనం

"అమ్మ ఈ రోజు చనిపోయింది. లేదా బహుశా నిన్న, నాకు తెలీదు." ఈ ప్రారంభ వాక్యాలతో ఉదాసీన గొంతుకతో మొదలయ్యే 'ద స్ట్రేంజర్' నవల సరిగ్గా ఎనభై ఏళ్ల క్రితం 1942లో వచ్చింది. ఆల్బర్ట్ కామూ ఫ్రెంచ్ భాషలో రాసిన, ఆంగ్లంలో 'ది ఔట్‌సైడర్' పేరుతో కూడా ప్రసిద్ధమైన ఈ నవల అసంబద్ధవాద తాత్విక చింతనకు శిఖరాయమానమైన రచనగా నిలిచింది.

ఈ ప్రపంచానికి ఏ క్రమమూ లేదు, జీవితం అనేదానికి ఏ పరమార్థమూ లేదని అసంబద్ధవాదం చెబుతుంది. ఈ ప్రపంచం ఇలా ఉంటే బాగుంటుందనే అంచనాతో జనాలు ప్రవర్తిస్తారు. అలా ఉన్నా, ఉండకపోయినా ఈ ప్రపంచానికి పోయేదేమీ లేదు. కానీ మన తార్కిక మెదడు ఒక క్రమాన్నీ, అర్థాన్నీ అందుకోవడానికి నిరంతరం ప్రయత్నిస్తుంది. ఈ కఠిన సత్యాన్ని మనిషి అనేవాడు ఎదుర్కోవాల్సిందే. లేదా చచ్చిపోవడమే దారి. అలా చేయలేనివాళ్లు దేవుడినో, ఆధ్యాత్మికతనో ఆశ్రయిస్తారు. దానికి బదులుగా ఆ అర్థంలేనితనాన్ని అంగీకరించడం ఉత్కృష్ట మార్గం. దీన్నే మహత్తరమైన వచన సరళతతో, అత్యంత సంక్లిష్టమైన యాంటీ–హీరో పాత్ర చిత్రణతో నిరూపిస్తాడు కామూ.

ఫ్రెంచ్–అల్జీరియాలోని అల్జీర్స్ నగరంలో మ్యూర్‌సో ఒక మామూలు ఉద్యోగి. వచ్చేది అరాకొరా జీతం. తల్లిని మరెంగో గ్రామంలోని వృద్ధాశ్రమంలో ఉంచుతాడు. ఆమె మరణవార్త టెలిగ్రామ్ అందుకున్నాక, అంత్యక్రియలకు రెండ్రోజుల సెలవు అడుగుతాడు. (దానికి బాస్ చిరాకుగా ముఖం పెడతాడు. కారణం: అంత్యక్రియలు శుక్రవారం కాబట్టి, వీకెండ్‌తో కలుపుకొని ఆ సెలవు నాలుగు రోజులవుతుంది.) అలా సెలవు అడగాల్సి వచ్చినందుకు పశ్చాత్తాపపడుతూనే తల్లి దగ్గరికి వెళ్లిన మ్యూర్‌సో ప్రవర్తనలోని పొసగనితనాన్ని ప్రపంచం అడుగడుగునా గమనిస్తుంది. తల్లి శవం పక్కన జాగారం చేస్తూ సిగరెట్ కాల్చుతాడు. కాఫీ తాగుతాడు. అతడు వెళ్లేప్పటికే మూసేసివున్న శవపేటిక తలుపు తెరవనక్కర్లేదని చెప్పి అక్కడి సహాయకుడిని విస్తుపోయేలా చేస్తాడు. ఇంకా ముఖ్యంగా తల్లి చనిపోయిందని ఏడ్వడు.

తెల్లారి బీచిలో మాజీ సహోద్యోగి మరీ కార్డోనా అనుకోకుండా ఎదురవుతుంది. ఇద్దరూ ఈత కొడతారు. మ్యూర్‌సో కోరిక మీద సినిమాకు వెళ్తారు. అది కూడా కామెడీ సినిమా. ఆ రాత్రి ఇద్దరూ కలిసి గడుపుతారు. గతం రోజే తల్లి ఖననం జరిగివుందనేది ఒక నేపథ్య వాస్తవం. మ్యూర్‌సో తన చర్యల పరిణామాల గురించి ఆలోచించడు. ఇతరులు ఏమనుకుంటారో అని తలచడు. సందర్భశుద్ధి గల ఉద్వేగాలు ప్రకటించడు. సింపుల్‌గా చెప్పాలంటే, అతడు జీవితపు ఆట ప్రకారం ఆడడు. అందుకే అతడు సమాజానికి 'అపరిచితుడు', లేదా 'బయటివాడు'. అందువల్ల దానికి తగిన మూల్యం చెల్లిస్తాడు. అనుకోకుండా అతడు చేసిన హత్య కన్నా, అతడి (అ)ప్రకటిత ఉద్వేగాలు ఎక్కువ ప్రశ్నార్థకం అవుతాయి.

నిజాయితీతో కూడిన జవాబులే అయినప్పటికీ – విచారణ సమయంలో తాను అరబ్బును చంపడానికి కారణం మండుటెండ పుట్టించిన చీదర అని జవాబివ్వడం ద్వారా న్యాయమూర్తినీ, జైల్లో పడ్డాక కూడా తనకు దేవుడు అక్కర్లేదని మతగురువునూ చీకాకుపెడతాడు మ్యూర్‌సో. ప్రకృతి మాత్రమే మన జీవితాల్ని శాసిస్తుందని చెప్పడం కామూ ఉద్దేశం. భౌతిక అవసరాలు మాత్రమే మ్యూర్‌సోను శాసిస్తాయి. జైలు మూలంగా ఈత కొట్టలేకపోవడం, సిగరెట్లు కాల్చలేకపోవడం, శృంగార జీవితం లేకపోవడం గురించి బాధపడతాడు. ఆ శృంగారం కూడా ప్రత్యేకించి మరీయే అని కాదు. నిజానికి మనుషులు లోలోపల ఇలాగే ఉంటారు. కానీ పైన ఒక ఆమోదనీయ పొరను కప్పుకొంటారు. ఇంకోలా ఉండాలనో, ఉండలేకపోవడం తప్పనో భావిస్తారు.

ఒకప్పుడు లక్ష్యం ఉండి, ఇప్పుడు అంతా ఒకటే అనే స్థితి మ్యూర్‌సోది. ప్రమోషన్లీ వచ్చినా, రాకపోయినా తేడా లేదనే మనిషి ఎవరు ఉండగలరు? ఇదొక రుషిత్వపు లక్షణంలా కనబడుతుంది. కానీ ఎలా ఉన్నా అర్థమే లేనప్పుడు, దానికోసం మళ్లీ ప్రత్యేకంగా తపన పడటం ఎందుకనేది అతడి వాదం. నిజానికి ఒక సున్నితమైన మనిషి మ్యూర్‌సోలో ఉంటాడు. అరబ్బును చంపిన తర్వాత తానిక సంతోషంగా ఉండలేనని అతడికి తెలుసు. అయినా అది జరిగిపోయింది. దానికి ఇదమిత్థంగా కారణం చెప్పలేడు. అరబ్బు హత్య, ఆ హత్యకు దారితీసిన పరిస్థితులు, ఇవేవీ కూడా ఒక క్రమం వల్ల జరిగినవి కావు. కానీ మ్యూర్‌సో జీవితం ఒక పెద్ద మలుపు తిరుగుతుంది. జీవితానికో ప్రత్యేక క్రమం ఉందన్న వాదనను ఇది పటాపంచలు చేస్తుంది. అందుకే చివరలో గిలటిన్‌తో తలను తెగ్గొట్టే మరణ శిక్ష అనుభవించడానికి ముందు, ఇక అక్కడ పోగుకాబోయే కోపగ్రస్థ మూక అరుపులను ఊహించుకున్నాక, ప్రపంచం గురించి అతడికి ఉన్న ఆ చివరి భ్రమలు కూడా తొలగిపోతాయి. జీవితపు సున్నితమైన ఉదాసీనతకు మేలుకుంటాడు. శిక్షను తేలిగ్గా అనుభవించే మానసిక స్థితికి వస్తాడు. అతడి చింతన సంపూర్ణమవుతుంది.

ఊహ తెలిసేనాటికే మొదటి ప్రపంచ యుద్ధంలో తండ్రిని పోగొట్టుకున్నాడు కామూ. రెండో ప్రపంచ యుద్ధంలో లక్షలాది మంది జీవితాలు చెదిరిపోవడం చూశాడు. అల్జీరియాలో ఫ్రెంచివారి అణిచివేతకు సాక్షిగా ఉన్నాడు. పేదరికాన్ని అనుభవించాడు. జీవితపు అర్థరాహిత్యం ఆయన అనుభవసారం. కథకుడు, నాటకకర్త, పాత్రికేయుడు అయిన కామూ తన 28వ యేట 'స్ట్రేంజర్' రాశాడు. 1957లో నోబెల్ వరించింది. ఆ పురస్కారం అందుకున్న అత్యంత పిన్నవయస్కుల్లో ఒకరిగా నిలిచాడు. కానీ మూడేళ్లకే తన 46వ యేట కారు ప్రమాదంలో అర్థంతరంగా కన్నుమూశాడు, ప్రపంచపు అసంబద్ధతను తన జీవితం ద్వారా కూడా నిజం చేస్తూ!

## కోర్టు ఫీజు స్టాంపులు బ్లాక్ లో అమ్ముతున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కి లేఖ

### - మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ



**(విన్యూస్, మచిలీపట్నం) :** కృష్ణాజిల్లా, ఎన్టీఆర్ జిల్లాలో స్టాంపులు కొరతను ఆసరాగా తీసుకుని జ్యుడీషియల్ మరియు నాన్ జ్యుడీషియల్ స్టాంపులను బ్లాక్ లో అమ్ముతున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లని కోరుతూ మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ డిమాండ్ చేశారు. సోమవారం మచిలీపట్నంలో బాలాజీ మాట్లాడుతూ మచిలీపట్నం, విజయవాడ, గుడివాడ ప్రాంతాలలో కోర్టు ఫీజ్ స్టాంపులను నాన్ జ్యుడీషియల్ స్టాంపులను కృత్రిమ కొరత సృష్టించి, అధిక ధరలకు అమ్ముతున్న స్టాంపు వెండార్లు, మధ్యవర్తులపై చర్యలు తీసుకోవాలని బాలాజీ కోరారు. జిల్లా ముఖ్య కేంద్రం మచిలీపట్నానికి జిల్లాలో పలు ప్రాంతాల నుంచి విచ్చేస్తున్న న్యాయవాదులు కక్షిదారులు స్టాంపులు కొరత వలన తీవ్ర ఇబ్బంది పాలవుతున్నారని బాలాజీ తెలియజేశారు. ఎంతో కాలంగా ఉన్నా ఖాళీగా ఉన్నా మచిలీపట్నం జిల్లా కోర్టులో స్టాంపు వెండర్ లేకపోవడం వల్ల, స్టాంప్ లు లేకపోవటం వల్ల న్యాయవాదులు గుమస్తాలు కక్షిదారులు ఇబ్బందులు పడుతున్నారని, కేసులు దాఖలు చేయడంలో జాప్యం కలుగుతుందని బాలాజీ తెలియజేశారు. జిల్లా రిజిస్టర్ తక్షణమే దృష్టి సారించి అన్ని న్యాయస్థానాలలో జ్యుడీషియల్ స్టాంపులు, నాన్ జ్యుడీషియల్ స్టాంపులు లభ్యం అయ్యేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని బాలాజీ కోరారు. రూపాయి విలువ గల కోర్ట్ ఫీజ్ స్టాంపులు లభ్యం కాకపోవటం వల్ల అధిక విలువగల స్టాంపులను అంటించవలసి వస్తుందని తెలియజేశారు. 10 రూపాయలు విలువగల నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్ ను 20 రూపాయలకు జిల్లా వ్యాప్తంగా అమ్ముతున్న అధికారులు స్పందన లేదని బాలాజీ పేర్కొన్నారు. కొంతమంది స్టాంప్ వెండర్లు ధనమే ధ్యేయంగా పాత తేదీలతో స్టాంప్ పేపర్లను వేల రూపాయలతో వికరిస్తున్నారని వారిపై నిఘా పెంచవలసిన అవసరం ఉందని బాలాజీ తెలియజేశారు. అక్రమ స్టాంప్ పేపర్ల విక్రయం వలన చాలామంది కక్షి దారులు నష్టపోతున్నారని, అనవసరమైన లిటిగేషన్ తో కోర్టు లలో కేసులు సంఖ్య పెరుగుతుందని బాలాజీ తెలియజేశారు.

## రైతులు మిల్లుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదు

### - జిల్లాలో గోనె సంచులుకు కొరత లేదు, ధాన్యం రవాణా సమస్యలు లేవు

### - ధాన్యం కొనుగోలులో ఏవైనా సమస్యలు ఉంటే 9652014457 ఫోన్ చేయవచ్చు - జాయింట్ కలెక్టర్



**(వి న్యూస్ మచిలీపట్నం) :** జిల్లాలో ధాన్యం కొనుగోలులో ఏవైనా సమస్యలు ఉంటే నా ఫోన్ నెంబర్ 9652014457కు ఫోన్ చేస్తే గంటలో పరిష్కరిస్తామని జాయింట్ కలెక్టర్ డా. అపరాజిత సింగ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన స్పందనలో జాయింట్ కలెక్టర్ పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ధాన్యం కొనుగోలులో రైతులు తమ సమస్యలు స్పందనలో జాయింట్ కలెక్టర్ కు తెలియజేశారు. గూడూరు మండలం ముక్కొల్లు ఆర్ బీకేలో ధాన్యం విక్రయించిన రైతులు కొంత మంది స్పందనకు విచ్చేసి గోనె సంచులు తామే కొనుగోలు చేసుకున్నామని, విక్రయించిన ధాన్యం రవాణా ఆలస్యం అవుతున్నదని, ఆర్ బీకేలో విశ్లేషించిన ధాన్యం తేమ శాతం మిల్లుల వద్ద అంగీకరించడం లేదని రైతులు జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. పమిడిముక్కల మండలం ఐనంపూడి గ్రామానికి చెందిన రైతులు మాండూస్ తుపానుకు పడిన వర్షాలు కారణంగా వరి ముంపునకు గురై నష్టపోయామని ఆదుకోవాలని రైతులు కోరారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో సమస్యలు ఉంటే 9652014457 ఫోన్ నెంబరుకు ఫోన్ చేసిన గంటలో పరిష్కార చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గోనె సంచుల కొరత జిల్లాలో ఎక్కడా లేదని అన్నారు. ముక్కొల్లు గ్రామంలో రైతుల సమస్యలపై జాయింట్ కలెక్టర్ వీసీ ద్వారా సంబంధిత తహసీల్దారును వివరణ కోరారు. గంటలో రైతులకు అవసరమైన గోనె సంచులు అందించాలన్నారు. ఆర్బీకేలో విశ్లేషించిన తేమ శాతం ఫైనల్ అని, దీని ప్రకారమే ఎఫ్ఓ జనరేట్ చేయడం జరుగుతుందని, ఆమేరకు రైతు చెల్లించడం జరుగుతుందని, రైతులు మిల్లుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని అన్నారు. ధాన్యం కొనుగోలు చేశాక రవాణాకు వాహనాలు వెంటనే ఏర్పాటు చేయాలని, ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని జేసి అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్క రైతు ప్రభుత్వ మద్దతు ధరలు పొందేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. నింబంధనలకు విరుద్ధంగా ఎవరైనా అవకతవకలకు పాల్పడితే అట్టివారిపై కఠిన జరుగుతుందన్నారు. చర్యలు తీసుకోవడం మాండూస్ తుఫాను సందర్భంగా కురిసిన వర్షాలకు జిల్లాలో నష్టం జరిగిన చోట్ల మండల టీమ్ లు ఎన్యూమరేషన్ నిర్వహిస్తున్నాయన్నారు. నష్టం అంచనాలపై నివేదికలు రూపొందించి ప్రభుత్వానికి పంపడం జరుగుతుందన్నారు. స్పందన అర్జీలు: ఉయ్యూరు మండలం ఆకునూరుకు చెందిన వృద్ధ దంపతులు నూకల పాండురాజు తమ కుమారుడు సరిగా మమ్ములను పట్టించుకోవడం లేదని వారి సమస్యలు జాయింట్ కలెక్టర్ స్పందనలో వివరించి అర్జీ సమర్పించగా ఉయ్యూరు ఆర్డీఓ మరియు తహసీల్దారుతో వీసీ ద్వారా జాయింట్ కలెక్టర్ మాట్లాడి వీరి సమస్య పరిష్కార చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాండూస్ తుపాను ప్రభావానికి తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని నిబంధనలు సడలించి కొనుగోలు చేయించి రైతులకు న్యాయం చేయాలని కోరుతూ రైతు సంఘం ప్రతినిధులు, పలువురు రైతులు స్పందనలో అర్జీ దాఖలు చేశారు. ఉంగుటూరు మండలం, తేలప్రోలు గ్రామంలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసుకొన్న సెల్టవర్ నిలుపుచేయాలని కోరుతూ గ్రామస్థులు స్పందనలో అర్జీ దాఖలు చేశారు.

కంకిపాడు మండలం, మంతెన గ్రామానికి చెందిన యడల వరలక్ష్మీ తనకు ఒంటరి పింఛన్ మంజూరు చేయించాలని కోరుతూ అర్జీ ఇచ్చారు. తోట్లవల్లూరు మండలం, పెనమకూరు గ్రామానికి చెందిన మరీదు భోగేశ్వరరావు తనకు కపిళేశ్వరపురం గ్రామ పరిధిలో ఎకరం పొలం ఉన్నదని, పట్టాదారు పాస్ పుస్తకం ఇప్పించాలని కోరుతూ స్పందనలో అర్జీ దాఖలు చేశారు. ఈ సమావేశంలో ఆర్డీఓ ఐ.కిషోర్, డ్వామా పీడీ, హౌసింగ్ పీడీ ఇన్చార్జి జివి. సూర్యనారాయణ, డిఎం అండ్ హెచ్ ఓ డా.గీతాబాయి, డిఆర్ డిఏ పీడీ పిఎస్ఆర్ ప్రసాద్, డిపిఓ నాగేశ్వరనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతికి 6,400 ప్రత్యేక బస్సు సర్వీసులు




**అమరావతి :** సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లేవారి కోసం 6,400 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. జనవరి 6 నుంచి 18 వరకు ఈ సర్వీసులు అందు బాటులో ఉంటాయన్నారు. ప్రత్యేకబస్సు ల్లోనూ సాధారణ ఛార్జీలే ఉంటాయని, ముందస్తు రిజర్వేషన్ చేసుకునే సదుపాయం కూడా ఉందని చెప్పారు. రానుపోనూ ఒకేసారి టికెట్లు బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీ ఇస్తామన్నారు. విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. " 62 స్టార్‌లైనర్ నాన్ ఏసీ స్లీపర్ బస్సులు ప్రవేశపెట్టాం. వచ్చే మార్చి నాటికి కార్గో ద్వారా రూ.165 కోట్ల ఆదాయమే లక్ష్యంగా పని చేస్తున్నాం. అన్ని బస్సుల్లో ఈ నెలాఖరుకు టిమ్ మిషన్లు అందుబాటులోకి తీసుకొస్తాం. ఆర్టీసీని ప్రైవేటీకరించే యోచన లేదు. పొరుగు సేవల ఉద్యోగులను కూడా తొలగించడం లేదు" అని ఆయన అన్నారు.

"ఆర్టీసీ స్థలాన్ని వైకాపా కార్యాలయానికి కేటాయించినట్లు మా దృష్టికి వచ్చింది. ఆ స్థలాన్ని మా సంస్థకు గతంలో ఏపీఐఐసీ కేటాయించింది. సంస్థ ఆస్తులు కాపాడుకునే బాధ్యత మాపై, ప్రభుత్వంపై ఉంది. స్థలం కేటాయింపు విషయం తెలిసి నిరసన తెలిపాం. ఉద్యోగులకు ఓటీలు, అలవెన్సులు ఇచ్చే ప్రక్రియను కూడా ప్రారంభించాం. వివరాలను సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం. అలవెన్సులపై ఆర్టీసీ ఉద్యోగులు ఎవరూ కంగారు పడొద్దు. ఆర్టీసీ ఆదాయాన్ని ప్రతిరోజూ ప్రభుత్వానికి చెల్లించే ప్రతిపాదన లేదు." అని ద్వారకా తిరుమలరావు అన్నారు.

## స్టేట్ లెవల్ కరాటే టోర్నమెంట్‌లో బంగారు పతకాలు సాధించిన పల్లోటి విద్యార్థులు

**(విన్యూస్, పెడన) :** స్థానిక పెడన పట్టణము నందు గల పల్లోటి స్కూలు విద్యార్థులు పశ్చిమ గోదావరి జిల్లాలోని తణుకు పట్టణంలో డిసెంబర్ 17 , 18 తేదీలలో నిర్వహించిన ఇంటర్ స్టేట్ కరాటే టోర్నమెంట్ లో పాలు పంచుకున్న ఎనిమిది మంది విద్యార్థులలో ముగ్గురు స్వర్ణ పతకాలు, ముగ్గురు వెండి పతకాలు, ఇద్దరు కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా స్కూలు కరస్పాండెంట్ ఫాదర్




జోజిరెడ్డి మాట్లాడుతూ...! విద్యతో పాటు క్రీడలు, శారీరక వ్యాయామాలను కలిగించేటటువంటి అన్ని రకముల జీవన నైపుణ్యాలను విద్యార్థి దశలోనే పునికిపుచ్చుకోవడం ద్వారా విద్యార్థులు తదుపరి దశలో సర్వతోముఖాభివృద్ధి సాధిస్తారని తెలియజేశారు. అదే విధంగా వీరికి కరాటే శిక్షణ అందించిన కరాటే ఇన్స్ట్రక్టర్ సి హెచ్ . శివాజీ ని , విజేతలైన విద్యార్థులను అభినందించారు ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ పి. రాజీవ్ , విద్యార్థులు, పి. ఈ. టి లు దుర్గాభవాని, సరిత, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## విద్యార్థినికి ఆర్థిక సహాయం....

**(వి న్యూస్ మచిలీపట్నం) :** ప్రతిభ కలిగిన డిగ్రీ పేద విద్యార్థినికి విశ్రాంత అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శాయన సుశీలరావుహో, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ 10,000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మచిలీపట్నం రాజుపేట మున్సిపల్ కౌన్సిలర్ గా రెండుసార్లు పనిచేసిన నరహరశెట్టి వేణుగోపాలరావు మనవరాలు జయలక్ష్మి స్థానిక డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్స్ మూడో సంవత్సరం చదువుతుంది. గతంలో 10వ తరగతి పట్టణంలో ప్రథమ స్థానాన్ని పొందిన జయలక్ష్మి కి ఆర్థిక ఇబ్బందులు ఉన్న పరిస్థితులను గుర్తించి సాయినా వీరభద్రయ్య వీర రాఘవమ్మ ట్రస్ట్ , లంకిశెట్టి



ఫ్రెండ్స్ సర్కిల్ తరపున చెరో 5000 రూపాయలు కలిపి పది వేల రూపాయలను ఆదివారం అందించారు. ఈ సందర్భంగా సుసీలరావు మాట్లాడుతూ ప్రతిభల విద్యార్థుల్ని ప్రోత్సహించడమే తమ ట్రస్ట్ యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలియజేశారు. ఈ సహాయాన్ని తన కుమార్తె సాయన సంధ్య అందించడం జరిగిందని తెలియజేశారు.లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ ఇద్దరు ఆడపిల్లలతో ఇబ్బందులు పడుతున్న కుటుంబానికి తన వంతుగా 5,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించినట్లు తెలియజేశారు. జయలక్ష్మి అక్క కృష్ణ యూనివర్సిటీలో లో ఎంబీఏ చదువుతుండగా, జయలక్ష్మి మంచి మార్కులతో బీకాం ప్రథమ ద్వితీయ సంవత్సరాల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత జరిగిందని అన్నారు. ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు సమాజంలో స్తోమత ఉన్న వాళ్ళు సహకరించి ఆదుకోవాలని బాలాజీ విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో కొటక్ మహీంద్రా బ్యాంకు ఉద్యోగి తాడేపల్లి రమేష్ నరహరశెట్టి ప్రసాద్, జి. లక్ష్మీనారాయణ, సీతంశెట్టి పవన్ తదితరులు పాల్గొన్నారు.

## 21 నుంచి హైకోర్టు ఆన్లైన్ పరీక్ష

**(వి న్యూస్ మచిలీపట్నం) :** 21 డిసెంబర్ 2022 నుండి 02 జనవరి 2023 వరకు జిల్లావ్యాప్తంగా 22 సెషన్లలో నోటిఫికేషన్ డేట్ 21.10.2022 ద్వారా నోటిఫై చేయబడిన అన్ని కేటగిరీలో పోస్టుల భర్తీకి కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించబడుతుంది ని గౌరవ హైకోర్టు వారు తెలియజేశారు . సంబంధిత పరీక్షా కేంద్రాల జాబితా ఈ క్రింది విధంగా తెలియజేయడం జరిగింది. 1. అయాన్ డిజిటల్ జోన్ ఐ డి జ్, కంద్రిక, విజయదుర్గా కంప్యూటర్స్, ఎన్జీవోస్ కాలనీ, ఆపోజిట్ కంద్రిక బస్టాప్, విజయవాడ . 2. శ్రీ విజయ దుర్గ ఐటి ఇన్ఫో సొల్యూషన్స్, డోర్ నెంబర్ 20-498/1, బల్లెం వారి వీధి, మురళి నగర్, రామవరపాడు నుండి ఆటోనగర్ వైపు, విజయవాడ. 3. శ్రీ పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జున రావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, విజయవాడ. 4. ఎస్ వి టి ఇన్ఫోటెక్డో, డోర్ నెంబర్ 29-2-4/5, థర్డ్ ఫ్లోర్, రామ మందిరం రోడ్డు, గవర్నర్‌పేట, విజయవాడ. 5. ఉషా రామా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, తేలప్రోలు, ఉంగుటూరు మండలం, విజయవాడ. 6. వికాస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, వయానున్న, విజయవాడ రూరల్. 7. శ్రీ వాసవి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, నందమూరు, పెడన మండలం, మచిలీపట్నం. జిల్లాలో పరీక్షా కేంద్రాలకు కేటాయించబడిన అభ్యర్థులందరూ హాల్ టికెట్ నందు ఇవ్వబడిన గౌరవనీయ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సూచనలను పాటించాలని , ఏదైనా సాధారణ సమాచారం కోసం హైకోర్టు వెబ్సైట్ డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ.హెచ్ సి.ఏ పి .నిక్. ఇన్ అనుసరించాలని తెలియజేయబడింది. హాల్ టికెట్లో పేర్కొన్న రిపోర్టింగ్ సమయం ప్రకారం అభ్యర్థులందరూ తమ సంబంధిత పరీక్ష కేంద్రాలకు హాజరుకావాలని మరింత సమాచారం అందించారు , గేటు మూసి వేసిన సమయం తర్వాత అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు. అభ్యర్థులందరూ సూచనలను తప్పనిసరిగా పాటించాలని తెలియజేశారు. వెరిఫికేషన్ కోసం అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్ తో పాటు కనీసం ఒక ఒరిజినల్ చెల్లుబాటు అయ్యే గుర్తింపు కార్డును అంటే పాస్పోర్ట్, పాన్ కార్డ్, ఓటర్ ఐడి, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ కార్డ్ వంటి వాటిని సమర్పించాలి.

# గుడివాడ క్యాసినో.. ఐటీ అధికారులకు వివరాలందించిన తెదేపా

**విజయవాడ :** గుడివాడ క్యాసినోకి సంబంధించిన వివరాలను తెదేపా బృందం ఆదాయపు పన్ను శాఖ అధికారులకు అందజేసింది. కొడాలి నాని, వంశీ నేతృత్వంలో క్యాసినో నిర్వహించారంటూ.. తెదేపా బృందం గతంలో కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేయగా.. సంబంధిత వివరాలు అందించాలంటూ తెదేపా పొలిట్ బ్యూరోసభ్యుడు వర్ల రామయ్యకు ఆదాయపు పన్ను శాఖ నుంచి పిలుపు అందింది. ఆ మేరకు వర్ల రామయ్య, బోండా ఉమా, కొణకళ్ల నారాయణ, రావి వెంకటేశ్వరరావు విజయవాడలోని ఐటీ కార్యాలయానికి వెళ్లి.. వీడియోలు, ఇతర వివరాలు అందజేశారు. అనంతరం వర్ల రామయ్య మీడియాతో మాట్లాడుతూ.. డ్యాన్సర్లను గోవా నుంచి తీసుకొచ్చారని చెప్పడానికి అన్ని సాక్ష్యాధారాలు ఉన్నాయని, త్వరితగతిన విచారణ పూర్తి చేస్తామని ఐటీ అధికారులు చెప్పినట్లు వివరించారు. క్యాసినో ప్రవేశ రుసుం కింద రూ. 10 వేలు వసూలు చేశారని, దాదాపు రూ.500 కోట్ల మేర లావాదేవీలు జరిగాయని ఐటీ అధికారుల దృష్టికి తెదేపా బృందం మరోసారి తీసుకెళ్లింది. ఏపీ అధికారులెవ్వరూ పట్టించుకోకపోవడంతో కేంద్ర సంస్థలకు తమ ఎంపీలు ఫిర్యాదు చేశారని వర్ల రామయ్య తెలిపారు.

# రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తాం.. వారికి మాత్రమే: గహ్లోత్



**జైపూర్ :** రాజస్థాన్ సీఎం అశోక్ గహ్లోత్ కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలోని ఉజ్వల్ పథకం లబ్ధిదారులు వినియోగిస్తోన్న వంట గ్యాస్ సిలిండర్ ధరను దాదాపు సగానికి పైగా తగ్గించనున్నట్లు వెల్లడించారు. ఉజ్వల్ పథకం లబ్ధిదారులకు వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి కేవలం రూ.500లకే రీఫిల్ చేయించుకొనే వెసులుబాటు కల్పించనున్నట్లు ప్రకటించారు. ఉజ్వల్ పథకంలో నమోదు చేసుకొని దారిద్ర రేఖకు దిగువన ఉన్న కుటుంబాలే దీనికి అర్హులని స్పష్టం చేశారు. రాజస్థాన్‌లోని అల్వార్‌లో కొనసాగుతున్న భారత్ జోడో యాత్రలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమక్షంలోనే కేంద్రంపై తీవ్ర విమర్శలు చేసిన అశోక్ గహ్లోత్ ఈ ప్రకటన చేశారు. ప్రతి కుటుంబానికి ఏడాదికి 12 సిలిండర్లను సగం ధరకే అందజేస్తామన్నారు. ఇప్పటికే భారీగా పెరిగిన గ్యాస్ సిలిండర్ ధరలతో అవస్థలు పడుతున్న జనానికి ఉపశమనం కలిగించేలా వచ్చే ఏడాది ఎన్నికలుహొజరగనున్న వేళ గహ్లోత్ ఈ ప్రకటన చేయడం గమనార్హం.

"వచ్చే నెల బడ్జెట్ కోసం ప్రిపేర్ అవుతున్నాం. ఈ నేపథ్యంలోనే ఓ విషయం చెప్పదలచుకున్నా. ఉజ్వల పథకం కింద ప్రధాని నరేంద్ర మోదీ పేదలకు వంటగ్యాస్ కనెక్షన్లు అందించారు. కానీ సిలిండర్ ఖాళీగా ఉంది, ఎందుకంటే సిలిండర్ ధరలు ఇప్పుడు రూ.1040లకు చేరాయి. అందువల్ల ఉజ్వల్ లబ్ధిదారులకు మేం రూ.500లకేహొఒక్కో సిలిండర్ చొప్పున ఏడాదికి 12 సిలిండర్లు అందిస్తాం" అని గహ్లోత్ హామీ ఇచ్చారు.

అలాగే, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపైనా అశోక్ గహ్లోత్ విమర్శలు గుప్పించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తున్నారని.. ఐటీ, ఈడీ, సీబీఐ వంటి కేంద్ర సంస్థలు సైతం భయంతో పనిచేయాల్సి వస్తోందని ఆరోపించారు. నియంతృత్వ ధోరణిలో పాలిస్తూ ఈ దేశాన్నిఎటువైపు తీసుకెళ్తారో ఎవరికీ అర్థంకావడంలేదని వ్యాఖ్యానించారు. కేంద్రాన్ని విమర్శిస్తున్నవారిని జైళ్లకు పంపుతున్నారని ఆరోపించారు.

# బాల్యంలో ఎముకలు విరిగితే.. మళ్లీ మళ్లీ విరిగే ముప్పు

**డ్యునెడిన్ :** చిన్నతనంలో ఎప్పుడైనా కోతికొమ్మచ్చి ఆడినప్పుడో, లేదా గోడలు దూకినప్పుడో ఎముకలు విరిగాయా? అలా జరిగితే పెద్దయిన తర్వాత మళ్లీమళ్లీ ఎముకలు విరిగేందుకు, ఆస్టియోపోరోసిస్ (బోలు ఎముకల వ్యాధి) రావడానికి అవకాశం ఉంటుందని తాజాగా తేలింది. న్యూజిలాండ్‌లోని డ్యునెడిన్‌లో అయిదు దశాబ్దాల పాటు పలువురు మధ్యవయసు వారిపై చేసిన పరిశోధనల వివరాలను ఇప్పుడు వెల్లడించారు.

1972 ఏప్రిల్ నుంచి 1973 మార్చి వరకు ఒటెపోటి డ్యునెడిన్ ఆస్పత్రిలో పుట్టిన వెయ్యి మందిని తీసుకుని వారి ఆరోగ్యాన్ని ఇటీవలి వరకు పరిశీలించారు. క్రీడల్లో వారి భాగస్వామ్యం, శారీరక హింస, ముప్పును ఎదుర్కొనే ప్రవర్తన.. ఇలా పలు అంశాలను క్షుణ్నంగా గమనించారు. బాల్యంలో ఒకసారి ఎముకలు విరిగిన వారికి పెద్దయిన తర్వాత మళ్లీ విరిగే అవకాశం రెట్టింపు అయ్యిందని, మహిళల్లో తుంటి ఎముక సాంద్రత తగ్గుతోందని చెప్పారు. జీవనశైలిలో మార్పులు చేసుకుంటే మాత్రం దీర్ఘకాలంలో ఎముకల ఆరోగ్యం బాగుండటంతో పాటు ఆస్టియోపోరోసిస్ వచ్చే ముప్పు సైతం కొంత తగ్గుతోందన్నారు. పిల్లల్లో సగం మందికి కనీసం ఒకసారి, నాలుగోవంతు బాలురకు, బాలికల్లో 15% మందికి పలుమార్లు ఎముకలు విరుగుతాయి. కొందరికి మాత్రం బాల్యంలోనే పదేపదే కాళ్లు, చేతులు విరగ్గొట్టుకునే అలవాటు ఉంటుంది. పేద కుటుంబాల వారు, శారీరకశ్రమ ఎక్కువ చేసేవారు,


V స్మార్ట్ యాడ్స్

**Insurance**

యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అన్ని రకాల వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించబడును. ఇన్సూరెన్స్ చేయించుకోదలచిన వారు సంప్రదించండి: టి.సి.ఎన్ శ్రీనివాస్.
9246761404
08672-221097

**మస్కిటో డోర్స్&విండోస్**

చక్రిస్ మస్కిటోడోర్స్&విండోస్... అల్యూమినియమ్ మస్కిటో డోర్స్&విండోస్ తయారు చేయబడును. మరియు రిపేర్ చేయబడును.
సంప్రదించండి: చక్రిస్ మస్కిటోడోర్స్&విండోస్ గొడుగుపేట-మచిలీపట్నం
సెల్:9182197822
9121605277

ఆర్గానిక్ తేనె
సెల్: 7981850205



ఆర్గానిక్ తేనె
మచిలీపట్నంలో... ఆర్గానిక్ తేనె కోసం సంప్రదించండి:
7981850205

శ్రీ శివరామకృష్ణ జ్యోతిష్యాలయము
శంకర మఠం ప్రక్కన, గొడుగుపేట, మచిలీపట్నం.
జాతక పరిశీలన చేసి వివాహ, ఉద్యోగ, వ్యాపార, సంతాన తదితర విషయాల్లో దోషాలకు పరిహారాలు సూచింపబడును.
వివాహ పొంతన పరిశీలింపబడును.
సుముహూర్త నిర్ణయం చేయబడును.
సంప్రదించండి : 96407 54054-91828 17435

**తక్కువధరకే ప్రకటనలు**

ఇల్లు/స్థలం అమ్మలన్నా, కొనాలన్నా, అద్దెకు ఇవ్వాలన్నా, ఉద్యోగం కావాలన్నా, ఉద్యోగులు కావాలన్నా తక్కువ ధరతో విన్యూస్‌లో ప్రకటన ఇచ్చి నిశ్చింతంగా ఉండండి. మరిన్ని వివరాలకు సంప్ర: 9848667347

**LOANS**

HOME LOANS BUSINESS LOANS... PLEASE CONTACT: 9399936609

**LOANS**

BUSINESS LOANS MORTIGAGE LOANS CONTACT : 9491624334

SRI ANJANEYA TRADERS
శ్రీ ఆంజనేయ ట్రేడర్స్
మచిలీపట్నం




• టైర్ పంచర్ అవ్వడం • టైర్ వేడెక్కి పగిలిపోవడం • టైర్ అరిగిపోవడం
ఇలాంటి సమస్యలన్నింటికి చెక్ పెట్టండి
యస్. యస్. సిలెంట్ పంచర్ ఆయిల్ (యాంటీ పంచర్ లిక్విడ్)
BEL COMPANY Back side, Edepalli, Machilipatnam - 521001
Ph : 8555963793, 8143143422

రత్నం కంప్యూటర్స్
వేసవి ప్రత్యేక కంప్యూటర్ కోర్సులు
20సం॥ల అనుభవం గల కంప్యూటర్ శిక్షణ సంస్థ. డైరెక్టర్ చే నడపబడు సంస్థ. మావద్ద ప్రత్యేక శ్రద్ధతో కంప్యూటర్ కోర్సులు నేర్పబడును.
M.S. OFFICE
D.T.P., TALLY.ERP9., INTERNET - CONCEPTS HARD WARE
ఉదయం6గం॥ల నుంచి రాత్రి 9 గం॥ల వరకు పిల్లలకు ప్రత్యేక బ్యాచ్‌లు కలవు.
కంప్యూటర్ హార్డ్‌వేర్ చేయబడును. నేర్పబడును
రత్నంకంప్యూటర్స్, జవ్వారుపేట, వాణిహాస్పటల్ ఎదురుగా.మచిలీపట్నం.
సంప్రదించండి: 9885789811

**వి స్మార్ట్ యాడ్స్ కేవలం రూ.100/-లకే స్మార్ట్ యాడ్..**
----------
సంప్రదించండి
9848667347

**LOANS**

పర్సనల్ లోన్స్, బిజినెస్ లోన్స్, అగ్రికల్చర్ లోన్స్, ఎడ్యుకేషన్ లోన్స్ అన్ని రకాలలోన్స్ 2 రోజుల్లో ఇప్పించబడును. వడ్డీ 50 పైసలు. 1 లక్ష నుంచి 50లక్షల వరకు ఇవ్వబడును. కావల్సిన వారు సంప్రదించండి:
7095129660

**అమ్మబడును**

మచిలీపట్నం శివారు రాడార్ కేంద్రం దగ్గర కళ్యాణీటౌన్‌షిప్‌లో 300గజాల ఫ్లాట్ అమ్మబడును. కావల్సిన వారు సంప్రదించండి:
సెల్: 7032931205
సంప్రదించు వేళలు: ఉదయం11 - 2పిఎం

**వంట మనిషి కావలెను**

మచిలీపట్నం జల్లువారితోట డీమార్టు వెనుక నలుగురు గల కుటుంబంనకు వంట మనిషి కావలెను. (నాన్‌వెజ్) సంప్రదించండి: (ఉదయం10 నుంచి2గంటల) సెల్:7032931205

మచిలీపట్నం పరిసర ప్రాంత ప్రజలకు సదవకాశం
వాటర్ సర్వీసింగ్ & ఇంజన్ ఆయిల్ (జనరల్ సర్వీస్‌తో)
కేవలం రూ. 449/-లకే
బైక్ జాబ్ కార్డు ఇవ్వబడుతుంది.
ప్రతి ఒక్కరు ఈ అవకాశమును వినియోగించుకోవలసినదిగా మనవి.
నందిని ఆటోమొబైల్
సెల్ : 7396 7396 79
నవరంగ్ ఆటో కన్సల్టెన్సీ
లక్ష్మీటాకీస్ సెంటర్, డి-మార్టు రోడ్, మచిలీపట్నం - 521 002.
సెల్ : 9848520822




# వినియోగదారుల్లో చైతన్యం తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది

## - జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్




**(విన్యూస్,మచిలీపట్నం) :** వినియోగదారుల హక్కుల గురించి విద్యార్థినీ విద్యార్థులకు చిన్ననాటి నుంచే అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ తెలిపారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాలు పురస్కరించుకొని పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం చిలకలపూడి శ్రీ పాండురంగ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వినియోగదారుల ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జె సి డాక్టర్ అపరాజిత సింగ్ మాట్లాడుతూ, ప్రయోజనాలు, వారి హక్కులు, బాధ్యతల గురించి అవగాహన కల్పించడానికి భారతదేశంలో ప్రతి సంవత్సరం డిసెంబర్ 24 న జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని జరుపుకుంటారని తెలిపారు. డిసెంబర్ 24, 1986 న, వినియోగదారుల రక్షణ చట్టం 1986 భారత రాష్ట్రపతి ఆమోదం పొంది అమల్లోకి వచ్చిందన్నారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి పలు ప్రశ్నలు అడిగారు. మనదేశంలో వినియోగదారునికి ఎన్ని హక్కులు ఉన్నాయిని ? మీ ఇంట్లో కొత్తగా కొనిన మిక్సీ పాడైతే మీరేం చేస్తారు ? జిల్లా వినియోగదారుల ఫోరంలో కేసు వేయాలంటే ఎంత ఫీజు చెల్లించాలి ? సంయుక్త కలెక్టర్ సంధించిన అన్ని ప్రశ్నలకు బాల బాలికలు చురుగ్గా సమాధానం చెప్పడంతో ఆమె వారిని వెరీ గుడ్ అని ప్రశంసించారు. ఈనెల 24వ తేదీన జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జరిగే వకృత్వ పోటీల్లో మీరంతా పాల్గొంటున్నారా ? అలాగే వ్యాసరచన పోటీలో మీరు రాసే స్క్రిప్టులు నేను చదువుతానని బాల బాలికలతో ఆమె అన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా డిజిటల్ యుగం నడుస్తుండటంతో వినియోగదారుడు గాని ఉత్పత్తిదారుడు తమకే అర్ధం కాని కనిపించని పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. పర్యావసనంగా వినియోగదారులు మోసాలకు గురయ్యే అవకాశం ఉన్నదని దీనిని అరికట్టడానికి వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం 2019 తీసుకురావడం జరిగిందని అన్నారు. వినియోగదారుల రక్షణకు సంబంధించి కొత్త చట్టంలో జిల్లా కమిషన్ పరిధి కోటి రూపాయల వరకు ఉందని రాష్ట్ర కమిషన్ పరిధి కోటి నుంచి 10కోట్లకు, జాతీయ కమిషన్ 10కోట్ల రూపాయలకు పైగా విలువ కలిగిన కేసులను చేపట్టేలా కీలక మార్పులు చేశారని వివరించారు. వినియోగదారులను తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇచ్చేవారిని, అటువంటి ప్రకటనల్లో భాగస్వాములైన వ్యక్తులకు 10 లక్షల వరకు జరిమానా విధించే అధికారం కేంద్ర ప్రాధికార సంస్థకు ఉంది. అదే విధంగా మోసపూరిత ప్రకటనలో పాల్గొన్న ప్రముఖులపై ఇతర వాణిజ్య ప్రకటనల్లో నటించకుండా ఏడాది నుంచి మూడేళ్ల వరకు నిషేధం విధించవచ్చున్నారు.. జిల్లా స్థాయి కమిషన్లో కొత్తగా వివాదాల పరిష్కార కోసం మధ్యవర్తిత్వ కేంద్రాలు నెలకొల్పి సత్వర పరిష్కారం కల్పించే అవకాశాన్ని కొత్త చట్టం కల్పిస్తోంది. పరిష్కారం లభించని పక్షంలో జిల్లా స్థాయి కమిషన్ రాష్ట్ర జాతీయ కమిషన్లకు నివేదిక పంపాల్సి ఉంటుంది. వినియోగదారునికి జరిగే మోసాలను చట్టం దృష్టికి తీసుకువచ్చి న్యాయం చేసే విధంగా చట్టాన్ని రూపొందించడం జరిగిందని తెలిపారు. హక్కులకు సంబంధించి వినియోగదారులకు ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి చైతన్యం కల్పించడం ద్వారా మోసాలను గుర్తించి నష్ట పరిహారం అందించడమే కాక మోసం చేసిన వారికి శిక్షలు జరిమానాలు విధించడానికి కూడా ఈ చట్టం వెసులుబాటు కల్పించిందన్నారు. అధికారులు వినియోగ సంఘాలవారు ఈ దిశగా ప్రజల కోసం అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. పెద్ద పెద్ద దుకాణాల్లో టోల్ ఫ్రీ నెంబర్తో పాటు ఫిర్యాదుల పెట్టె వినియోగదారులకు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేయించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిఎస్ఓ పార్వతి, డివైఈవో యు.వి. సుబ్బారావు, హిందూ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. ఆర్. కె. మూర్తి,జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య కార్యదర్శి మోహనరావు, సీనియర్ అడ్వకేట్ లయన్ లంకిశెట్టి బాలాజీ, తూనికలు కొలతల శాఖ ఇన్స్పెక్టర్ ఈశ్వర్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ గోపాలకృష్ణ, పలు సంఘాల ప్రతినిధులు, పలువురు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# హాట్ టాపిక్ గా మారిన "రాధా- రావి" ఆత్మీయ కలయిక

## - సరదాగా మాట్లాడుకున్న ఇరువురు నేతలు
## - గుడివాడ రాజకీయాలపై తీవ్ర ప్రభావం
## - టీడీపీ శ్రేణుల్లో స్పష్టంగా కన్పిస్తున్న ఉత్సాహం



**(వి న్యూస్ గుడివాడ) :** మాజీ ఎమ్మెల్యేలు వంగవీటి రాధాకృష్ణ, రావి వెంకటేశ్వరరావుల ఆత్మీయ కలయిక ఇప్పుడు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో హాట్ టాపిక్ గా నిలిచింది. విజయవాడలోని 24కే కన్వెన్షన్ లో జరిగిన చెన్నుపాటి వారి వివాహ వేడుకల్లో ఈ ఇద్దరు నేతలు సందడి చేశారు. ''రాధా-రావి''లు గంటసేపు సరదాగా మాట్లాడుకున్నారు. మాజీ ఎమ్మెల్యే రాధాకృష్ణకు గుడివాడ ఏదో అవినాభావ సంబంధం ఉన్నట్టుగా కన్పిస్తుంటుంది. రాధాకృష్ణ గుడివాడ వచ్చినా లేక ఆయన ఎక్కడైనా గుడివాడ నేతలను కలిసినా ఆ వార్త పిచ్చపిచ్చగా వైరల్ అవుతుంటుంది. గతంలో జరిగిన అనేక సంఘటనలను ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. కొద్దిరోజుల కిందట పట్టణం లింగవరం రోడ్డులోని కే. కన్వెన్షన్ లో జరిగిన ఒక వివాహ వేడుకకు రాధాకృష్ణ విచ్చేశారు. రాధాకృష్ణ రాక కోసం గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని ఎదురుచూడడం చర్చనీయాంశమైంది. ఆ సందర్భంగా రాధాకృష్ణ, కొడాలి నానిలు కలిసి మాట్లాడుకున్న ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఈ నేపథ్యంలో కొడాలి నానికి గుడివాడలో ఇప్పుడు రాజకీయ ప్రత్యర్థిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, రాధాకృష్ణలు ఆత్మీయంగా కలుసుకోవడం కూడా తాజాగా రాజకీయ వర్గాల్లో సరికొత్త చర్చకు దారి తీసింది. గుడివాడకు చెందిన నేతలు కలిసిన ప్రతిసారీ పెద్దఎత్తున జరుగుతున్న చర్చకు రాధాకృష్ణ కేంద్ర బిందువుగా మారడానికి కారణాలు లేకపోలేదు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఎన్టీఆర్ నియోజకవర్గంగా ఉన్న గుడివాడలో కాపు సామాజిక వర్గానికి చెందిన దాదాపు 25 వేల ఓట్లు ఉన్నాయి. ఈ ఓట్లే గుడివాడ నేతలను రాధాకృష్ణ వెంటబడేలా చేస్తున్నాయి. మరోవైపు రాధాకృష్ణకు గుడివాడ నియోజకవర్గంలోని కాపు సామాజిక వర్గం నేతలతో సన్నిహిత సంబంధాలున్నాయి. సాక్షాత్తు దివంగత వంగవీటి మోహనరంగా కుమారుడు కావడంతో రాధాకృష్ణను పార్టీలతో సంబంధం లేకుండా కాపు సామాజిక వర్గం విపరీతంగా అభిమానిస్తుంటుంది. దీన్ని అనుకూలంగా మల్చుకునేందుకు గుడివాడ నియోజకవర్గంలోని పలువురు రాజకీయ నేతలు విపరీతంగా తహతహలాడుతుంటారు. ఎమ్మెల్యే కొడాలి నాని, మాజీ ఎమ్మెల్యే రాధాకృష్ణకు మధ్య ఎంతో కాలంగా ఉన్న స్నేహం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అయినప్పటికీ ఒక్కోసారి కొడాలి నాని, రాధాకృష్ణల మధ్య దూరం పెరిగిందనే వార్తలు చక్కర్లు కొడుతుంటాయి. వెనువెంటనే కొడాలి నాని, రాధాకృష్ణలు కలిసి మాట్లాడుకున్న సందర్భాలు కూడా మళ్ళీ సోషల్ మీడియాలో ప్రత్యక్షమవుతుంటాయి. ఇదిలా ఉంటే తాజాగా గుడివాడ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జిగా ఉన్న రావి వెంకటేశ్వరరావు తరచుగా రాధాకృష్ణను కలుస్తుండడం గుడివాడ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యేలుగా ఉన్న రాధాకృష్ణ, రావి వెంకటేశ్వరరావులు తెలుగుదేశం పార్టీలోనే కొనసాగుతున్నారు. దీంతో రావి కూడా ఏ మాత్రం తగ్గకుండా అవకాశం వచ్చిన ప్రతిసారీ రాధాకృష్ణను ఆత్మీయంగా కలుస్తూ తనదైన శైలిలో స్నేహాన్ని కొనసాగిస్తూ వస్తున్నారు. గుడివాడ రాజకీయాల్లో గెలుపు, ఓటమిలను ప్రభావితం చేసే శక్తి ఉన్న కాపు సామాజిక వర్గం ఓట్లను తనవైపు తిప్పుకునేందుకు మాజీ ఎమ్మెల్యే రావి ఇప్పటి నుండే పావులు కదుపుతున్నారు. రాధాకృష్ణ కూడా తెలుగుదేశం పార్టీలోనే ఉండడం రావికి మరింత కలిసొచ్చే అంశంగా చెబుతున్నారు. మొత్తం మీద రాధాకృష్ణ, రావి వెంకటేశ్వరరావుల ఆత్మీయ కలయిక గుడివాడ రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశం కావడం టిడిపి శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపిందని చెప్పొచ్చు.

# శ్రీ గోదా అమ్మవారికి ప్రత్యేక పూజలు



**(వి న్యూస్ అవనిగడ్డ):** కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గం కోడూరు మండలం లో ధనుర్మాసం, ఏకాదశి సందర్భాన్ని పురస్కరించుకుని కోడూరు లోని శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు ఆలయ ట్రస్టీ కోట పద్మావతి వర ప్రసాద్ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు దుంభాల శ్రీధరాచార్యులు ఆధ్వర్యంలో శ్రీ గోదా అమ్మవారికి ప్రత్యేక పూజలు, తిరుప్పావై ప్రవచనం, పాశుర నక్షత్ర హారతి, మహిళలచే మంగళ హారతి, పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# సీఎం పుట్టినరోజు కానుకగా కాంట్రాక్టు లెక్చరర్స్‌ని రెగ్యులరైజ్ చేస్తున్నామన్న శుభవార్త ప్రకటించాలి

## - సీఎం కి విజ్ఞప్తి చేసిన కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు గొర్ల మాణిక్యం విజ్ఞప్తి



**(వి న్యూస్ తూర్పుగోదావరి) :** ఈ నెల 21న సీఎం పుట్టినరోజు కానుకగా కాంట్రాక్టు లెక్చరర్స్ ని రెగ్యులరైజ్ చేస్తున్నామన్నా శుభవార్త ప్రకటించాలని కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు గొర్ల మాణిక్యం సీఎం కి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రెగ్యులర్ చేస్తామని అనేకసార్లు బహిరంగ వేదికల మీద చెప్పడమే కాకుండా ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు లెక్చరర్స్ ని వెంటనే రెగ్యులరైజ్ చేయాలన్నారు. అధికారంలోకి వచ్చి ఇప్పటికే మూడున్నరేళ్లు గడిచిపోయినప్పటికీ రెగ్యులరైజేషన్ ప్రక్రియ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని అందోళన వ్యక్తం చేశారు. ఒకప్రక్క రాజస్థాన్ ప్రభుత్వం 1,10,279మందిని, ఒడిశా ప్రభుత్వం 57 వేల మందిని, పంజాబ్ ప్రభుత్వం 28వేల మందిని, తెలంగాణ ప్రభుత్వం 11,103మందిని ఈ మధ్య కాలంలోనే రెగ్యులరైజ్ చేస్తే ఇక్కడ మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని వాపోయారు. గత ప్రభుత్వాలు హామీ ఇచ్చి మోసం చేశాయని కనీసం ఈ ప్రభుత్వంలోనైనా న్యాయం జరుగుతుందనే పూర్తి విశ్వాసంతో ఉన్నామన్నారు. గత 23సంవత్సరాలుగా ప్రభుత్వ చేస్తున్న శ్రమ దోపిడీకి గురౌతూ బానిస బ్రతుకులు బ్రతుకుతూ దుర్భర జీవితం గడుపుతున్నామని ఆవేదన వెళ్ళగక్కారు. ఇప్పటికే చాలా మంది వయసు మీరడంతో పదవీవిరమణ చేస్తే, మరికొంత మంది మానసిక క్షోభతో అనారోగ్యానికి గురై చనిపోయారని చింతించారు. కాబట్టి సీఎం తమ జన్మదినం సందర్భంగానైనా కాంట్రాక్టు లెక్చరర్స్ చీకటి జీవితాల్లో వెలుగులు నింపాలని విజ్ఞప్తి చేశారు. ప్రకటన విడుదల చేసిన వారిలో అసోసియేషన్ నాయకులు యు. లక్ష్మణ్, పి. రామకృష్ణ, ఎం. సత్యనారాయణ, పి. కుమార్ రాజా, పి. అలివేలు మంగ తయారు, ఎం. శ్రీనివాసరావు, పి. భాస్కరరావు తదితరులున్నారు.

# క్రీస్తు బోధనలు జీవితాలకు అన్వయించుకోవాలి



**(వి న్యూస్ పురిటిగడ్డ) :** ఏసుక్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరూ తమ జీవితాలకు అన్వయించుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు. పురిటిగడ్డ లోని సీఎస్ఐ చర్చి లో సెమీ క్రిస్టమస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సురేష్ బాబు మాట్లాడుతూ సాటివారిపట్ల కోపం, అసూయ, ద్వేషం లేకుండా సానుకూల దృక్పథంతో ఉండాలన్నదే ఏసుక్రీస్తు బోధనల్లో ప్రధానమైన అంశమని తెలిపారు. క్షణం క్షమాగుణం, సర్దుకుపోయే తత్వము లేకుండా తోటి వారి పట్ల అసూయ ద్వేషాలతో కూడిన మనస్తత్వం కలిగిఉండడం వల్ల మానసిక అశాంతి, ఒత్తిడికి గురై అనారోగ్యాల పోలవడం తప్ప ఏమీ లాభం లేదన్నారు . ఒత్తిడి, అశాంతి వల్లనే మధుమేహం, రక్తపోటు, గ్యాస్టిక్ సమస్యలు తలెత్తుతున్నాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారని తెలిపారు. వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొండూరు సురేష్ కుమార్ సమకూర్చిన దుప్పట్లను, బహుమతులను వృద్ధులకు, చిన్నారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దైవ సేవకులు గూడపాటి దైవ కృపావరం, నవరత్నం, మేడేపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. చిన్నారుల క్రీస్తు పాటలతో కూడిన నృత్యాలు పలువురుని అలరించాయి.

# దేశ సంస్కృతి పర్యావరణ పరిరక్షణకై సుదూర సైకిల్ యాత్ర

## - ది క్రెడో పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రసంగిస్తున్న డాక్టర్ కిరణ్ సేథ్



**(వి న్యూస్ కర్నూలు) :** భారతీయ సనాతన సంస్కృతి , సంప్రదాయ సంగీత ప్రచార సంస్థ) దేశ వ్యాప్తంగ గత 45 సంవత్సరాలుగా, స్వచ్ఛందంగా, రాజకీయ రహితంగా, యువ చైతన్యమే లక్ష్యంగా భారత వారసత్వ పరిరక్షణకు శ్రీకారం చుట్టి భారత మూలాలతో పాటు, సంప్రదాయ సంగీత , సాంస్కృతిక, జానపద కళలు, నృత్యం, చలన చిత్రం, ధ్యానం, యోగా మొదలైన విభాగాల్లో ప్రముఖుల ప్రసంగాలతో చర్చలతో అవగాహన ,హొప్రదర్శనతో ప్రోత్సాహం కలిగిస్తున్న గుర్తింపు కలిగిన ప్రతిష్టాత్మక సంస్థ." పాఠశాలలు, కళాశాలల్లో సృజానాత్మక కళలతో పాటు, భారతీయ సనాతన సంస్కృతి, సంప్రదాయం సంగీతం, వారసత్వం గురించి అవగాహన ఇందులో భాగంగానే 73 ఏళ్ల " డా. కిరణ్ సేథ్ కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు సైకిల్ యాత్ర"( 15 ఆగస్ట్ 2022 తో శ్రీనగర్ నుండి మొదలైన ఆయన ప్రయాణం – జనవరి 31, 2023 కన్యాకుమారి చేరుకోవడంతో విజయవంతమవుతుంది. డా. కిరణ్ సేథ్ గత కొంత కాలంగా సుదూర సైకిల్ యాత్రను చేస్తున్నారు. 2022 మార్చ్ 11 డిల్లీ నుండి మొదలై రాజస్థాన్, గుజరాత్ కలుపుకుంటూ 14 ఏప్రిల్ 2022 అహ్మదాబాద్ ను చేరుకున్నారు. తన తిరుగు ప్రయాణంలో రాజ్ ఘాట్ ను చేరుకోవడానికి మధ్య ప్రదేశ్, రాజస్థాన్, హర్యానా ఉత్తరప్రదేశ్ గుండా సైకిల్ యాత్ర చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం జూన్ 5 నాటికి సుమారు 2200 కే ఎం సైకిల్ చేశారు. ఆయన సైక్లింగ్ యాత్రలో భారతీయ వారసత్వాన్ని, సనాతన సంస్కృతిపై అవగాహన కలిగించడం. సైక్లింగ్ అనేది శారీరిక, మానసిక, ఆధ్యాత్మిక సాధనకు ఒక అవకాశమని చెప్పడం. గాంధీహొసందేశమైన " ఉన్నంతలో బతుకు కానీ ఉన్నతంగా ఆలోచించు" అన్నది వ్యాప్తి చేయడం. " నువ్వు కోరుకున్న మార్పుని నువ్వే కావాలి" అన్న గాంధీ స్ఫూర్తిని నిజం చేస్తూ ఆయన సైక్లింగ్ లో ఎటువంటి ఆధునిక హంగులు లేకుండా కొన్ని జతల బట్టలతో గేర్లు లేని సాధారణ సైకిల్ పై యాత్ర చేస్తున్నారు. ఆయన ప్రయాణంలో భాగంగా నగరంలోని శ్రీలక్ష్మి పాఠశాలలో విద్యార్థుల్ని , ఉపాధ్యాయులను, ఇతర కార్య నిర్వహణ సిబ్బందిని కలిశారు. ఈ కార్యక్రమంలో శ్రీలక్ష్మి విద్యాసంస్థల అధినేత మాధవి లత, వంశీ, ది క్రెడో పాఠశాల కరస్పాండెంట్ కార్తీక్ నాయుడు పాఠశాల ప్రిన్సిపల్ శ్రావ్య లక్ష్మి, రవీంద్ర స్కూల్ ప్రిన్సిపల్ సుబ్బయ్య , అకడమిక్ కో–ఆర్డినేటర్లు పర్వీన్ కౌసర్, సాయి ప్రణతి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ నారాయణ, పాల్గొన్నారు.

# విజ్ఞాన్స్ వర్సీటీలో ఘనంగా సెమీ క్రిస్టమస్ వేడుకలు




**(వి న్యూస్ చేబ్రోలు) :** చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని విద్యార్థుల ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్‌లోని స్టూడెంట్ కౌన్సిలర్ గడ్డం సుధీర్ మాట్లాడుతూ జీవితంలో విద్యార్థులు భయానికి, ఆందోళనకు, ఒత్తిడికు గురికావద్దని పేర్కొన్నారు. కష్టకాలంలో దేవుడిని ప్రార్థించాలని, తొందరపడి క్షణికావేశంలో ఎటువంటి ఆలోచనలు, నిర్ణయాలు తీసుకోరాదన్నారు. ప్రతి వ్యక్తి జీవితంలో కష్టసుఖాలనేవి సాధారణమని, జీవితంలో చీకటి తర్వాత వెలుగులు కూడా నిండుతాయని తెలియజేసారు. జీవితంలో దేవుడు ఎప్పుడు మీకు తోడుగా ఉంటాడని, మిమ్మల్ని సమున్నత స్థానాలకు తీసుకెళ్తాడని తెలియజేసారు. ఏసుక్రీస్తు బోధనలు వర్తమాన సమాజానికి మార్గదర్శకాలని పేర్కొన్నారు. సత్యం, ధర్మం, శాంతి, సహనం అనే ఆయుధాలను ఏసుక్రీస్తు ప్రపంచానికి అందించారన్నారు. ధర్మం కోసం



అడుగులు వేసే ఎవరైనా సత్యాన్ని నిర్భయంగా ప్రకటిస్తారనేది క్రీస్తు జీవితం ద్వారా మనకు తెలుస్తుందని, సత్యాన్ని మానవాళికి ప్రకటించడంతో శాంతి, సహనాలను ప్రభువు ఎప్పుడూ విడిచిపెట్టలేదని చెప్పారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ విద్యార్థులకు ముందస్తుగా క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పారు. క్రీస్తు అందించిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించి, ప్రపంచ శాంతికి సర్వమానవాళి సౌభ్రాతృత్వానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఏసుక్రీస్తు లోకరక్షకుడని, ఆయన పుట్టుకతోనే సమస్త మానవాళికి రక్షణ వచ్చిందని అన్నారు. ఏసుక్రీస్తు భూమి మీద పుట్టడమే మానవాళి చేసుకున్న గొప్ప భాగ్యమని, క్రీస్తు ప్రతి ఒక్కరి జీవితాలలో జన్మించటమే నిజమైన క్రిస్మస్ అని తెలిపారు. ఏసుక్రీస్తు వారు సమస్త మానవాళి పాపములను క్షమించుట కొరకే ఈ భూమ్మీద నరరూపిగా జన్మించాడని, ఆయన జననం ద్వారా లోకానికి రక్షణ వచ్చిందన్నారు. క్రిస్మస్ పండుగ ఆచారాలకు సంబంధించిన పండుగ కాదన్నారు. ఇది ఆత్మీయతను పెంచే అనిర్వచనీయమైన అనుభవం అన్నారు. క్రీస్తును హృదయంలో కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ పరవశమందే సమయమన్నారు. ప్రపంచంలో కొన్ని పండుగలు, కొన్ని ప్రాంతాలకు, కులాలకు, మతాలకు, సంస్కృతులకు మాత్రమే పరిమితమై ఉంటాయన్నారు. క్రిస్మస్ మాత్రం విశ్వవ్యాప్తంగా సంతోషంగా జరుపుకునే పండుగ అన్నారు. మానవులందరికీ శుభాన్ని కలుగజేసే పండుగని తెలియజేసారు. విజ్ఞాన్స్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రేమ, క్షమాగుణం, దయ, కరుణ కలిగి ఉండాలన్నారు. క్రీస్తు మార్గం అందరికీ అనుసరణీయమన్నారు. ప్రభువు లోకానికి శాంతి సందేశాన్ని అందించారని తెలిపారు. ప్రజలను రక్షించేందుకు ఆయన మరణం పొందారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రిస్మస్ కేక్ కట్ చేశారు. స్వీట్లు పంచుకున్నారు. విద్యార్థులు ఆలపించిన క్రిస్మస్ గీతాలు ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక ప్రదర్శనలు కట్టిపడేశాయి. కార్యక్రమంలో విజ్ఞాన్స్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి అంటూ టీడీపీ నాయకులు ధర్నా

## -ధాన్యం రైతులకు దక్కని మద్దతు ధర : ఎం.ఎల్. సి. బచ్చుల అర్జునుడు



**(విన్యూస్, గన్నవరం):** రైతులు కు న్యాయం చేయాలి అంటూ ర్యాలీగా గన్నవరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న బచ్చుల అర్జునుడు. తహసీల్దార్ కార్యాలయం లో నిరసన తెలియజేసి వినతిపత్రం అందజేసిన టీడీపీ నాయకులు. బచ్చుల అర్జునుడు మాట్లాడుతూ తేమ పేరుతో రైతులును దోచుకుంటున్న ప్రభుత్వం. ఆర్ బి కె కేంద్రాలు ధాన్యం పరిశీలించి తేమ శాతన్ని 17 ఉంది అని మిల్లర్లను తోలుకోమని చెప్పినా మిల్లర్లు మాత్రం తేమ శాతం 20 ఉందంటూ రైతులను దోచుకుంటున్న వైనం. బస్తాకి 40 రూపాయలు చొప్పున రైతులు మిల్లర్లకు చెల్లించకపోతే ధాన్యం దించుకోని పరిస్థితి. ధాన్యం నింపటానికి రైతుకు సంచులు లేక రోడ్లు పైనే ధాన్యం ఆరబోసి, ఒక పక్కన ఏ సమయం లో వర్షం పడుతుందో అని బిక్కు బిక్కు మంటున్న రైతన్నలు. సంచులు, హమాలీ చార్జీలు, ట్రాన్స్పోర్ట్ ఖర్చులు రైతులు గత ప్రభుత్వాలే చెల్లించాయి. ఇప్పుడు మాత్రం రైతులు తన జేబులో డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి. ఆర్ బి కె కేంద్రాలు తేమ శాతాన్ని ఎంత అని నిర్ణయిస్తే మిల్లర్లు అదే లెక్కలో తీసుకోవాలి. ఒక పక్కన తెలంగాణ ప్రభుత్వం 50 లక్షల టన్నులు కొనుగోలు చేసి ఇంకా ఎన్ని టన్నులు ధాన్యం ఉన్నా కొనుగోలు చేస్తాం అని చెబుతుంది. మన ప్రభుత్వం పండించిన ధాన్యాన్నే కొనుగోలు చెయ్యట్లేదు. ఇదేం ఖర్మ. 21 రోజుల్లో ధాన్యం కొనుగోలు చేస్తాం అని చెప్పిన ప్రభుత్వం గత సంవత్సరం పండించిన పంట డబ్బులే ఇంత వరకు ఇవ్వలేదు. గత ప్రభుత్వల ముఖ్యమంత్రులు వర్షాలు పడి దెబ్బతిన్న పంటలు ఏరియల్ సర్వే చేసి పంట కి తగిన నష్టం ఇచ్చేవాళ్ళు. కానీ జగన్ మోహన్ రెడ్డి మాత్రం ఇంట్లో కూర్చుని కబుర్లు చెబుతూ కాలయాపన చేస్తున్నాడు అంటూ మండి పడుతున్న టీడీపీ నాయకులు రైతులు. ఈ కార్యక్రమంలో సాగునీటి వినియోగదారు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి దొంతు చిన్న, గన్నవరం మండలం పార్టీ అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వర రావు, రాష్ట్ర రైతు కార్యదర్శులు గుండపునేని ఉమా వరప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, కొండేటి కొండలరావు, జిల్లా ఉపాధ్యక్షుడు దండు సుబ్రహ్మణ్యం రాజు, జిల్లా కార్యదర్శి జూపల్లి సురేష్, రాష్ట్ర మహిళ కార్యదర్శి మండవ లక్ష్మి, రాష్ట్ర యువత కొసరాజు సాయి, రాష్ట్ర టీఎన్ ఎస్ ఫ్ కార్యదర్శి కొమ్మినేని బాబి, రాష్ట్ర టిఎన్టియుసి కార్యదర్శి బుస్సే నాగప్రసాద్, జిల్లా రైతు ఉపాధ్యక్షుడు మొవ్వ వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కొండేటి వెంకటేశ్వరరావు, జిల్లా రైతు కార్యదర్శి ఖమ్మం పాటి సుభాష్ చంద్రబోస్, జిల్లా రైతు కార్యదర్శి జాస్తి మురళి, జిల్లా అంగన్వాడి అధ్యక్షురాలు పొదిలి లలిత, సీనియర్ నాయకులు బొప్పన హరికృష్ణ, చిరుమామిళ్ల సూర్యం, నియోజకవర్గ యువత అధ్యక్షుడుపరుచూరి నరేష్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలుమేడేపల్లి రమాదేవి, నియోజకవర్గ అంగన్వాడి అధ్యక్షురాలు ఖమ్మంపాటి లక్ష్మి, నియోజకవర్గ టిఎన్టియుసి అధ్యక్షుడు ఆళ్ల శ్రీనువాసరావు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు మోదుగుమూడి సత్యనారాయణ, ఉంగుటూరు మండల అధ్యక్షుడు ఆరుమల్ల వెంకట కృష్ణారెడ్డి, మండల రైతు అధ్యక్షుడు ఆరుమల్ల వెంకట కృష్ణారెడ్డి, గన్నవరం టౌన్ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, నియోజకవర్గ ఎస్సీ సెల్ కార్యదర్శి ప్రభుదాస్, విజయవాడ రూరల్ మండల యువత అధ్యక్షులు గంపా శ్రీను, మండల ఉపాధ్యక్షుడు కంచర్ల ఈశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి బోడపాటి రవికుమార్, క్లస్టర్ ఇంచార్జ్ కానూరి యుగంధర్, గన్నవరం మండలం మహిళా అధ్యక్షురాలు చిక్కవరపు నాగమణి, ఉంగుటూరు మండలం మహిళా అధ్యక్షురాలు రమ్యకృష్ణ, విజయవాడ రూరల్ మండలం మహిళా అధ్యక్షురాలు నెక్కంటి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# తుఫాను కారణంగా నష్టం వాటిల్లిన పంటల వివరాలు తెలుసుకున్న ఆదిమూలపు సురేష్



**(వి న్యూస్ మార్కాపురం) :** జిల్లాలో ఇటీవల తుఫాను కారణంగా నష్టం వాటిల్లిన పంటల వివరాలను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సోమవారం ఒంగోలు లోని క్యాంపు కార్యాలయంలో ఆయన వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో సమీక్షించారు. దెబ్బతిన్న పొగాకు, మిర్చి, వరి ఇతర పంటల వివరాలు, ఏపి ప్రాంతాల్లో అధికంగా నష్టం వాటిల్లింది తదితర సమాచారాన్ని అధికారులు వివరించారు. నష్టం అంచనాలు రూపొందించి క్రమంలో అర్హులైన రైతులందరికీ న్యాయం జరిగేలా చూడాలని, క్షేత్రస్థాయిలో అధికారులు పొలాలను సందర్శించి వివరాలు నమోదు చేయాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, ఉద్యానవనశాఖ అధికారి గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

# సెమీ క్రిస్మస్ లో పాల్గొన్న గన్నవరం జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజా బెత్ రాణి



**(విన్యూస్ గన్నవరం) :** గన్నవరం మండలం కొండ పావులూరు గ్రామంలో రాత్రి జరిగిన సెమీ క్రిస్మస్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నా గన్నవరం జ్ పి టి సి సభ్యురాలు అన్నవరపు ఎలిజా బెత్ రాణి మాట్లాడుతు యేసు క్రీస్తు ప్రభువు పుట్టిన రోజు సందర్భంగా ఆడ్మాన్స్ గా సెమీ క్రిస్మస్ కార్యక్రమంలో పాల్గొనటం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఈ సందర్భంగా ఇక్కడ పాల్గొన్నా అందరికీ నేను దేవుని సందేశం గా ఒకటి చెప్పాలనుకున్నాను. పేదరికంలో పుట్టటం తప్పు కాదు. పేదరికంలో చానిపోటం భాదకరం అందువల్ల మీరు మిపిల్లాలను డా. బి అర్ అంబేత్కర్ ఇచ్చిన రాజ్యాంగం ను ఉపయోగించుకొని ఉన్నత చదువలు చదివించాలని అప్పుడే మన పేదరికం పోతుందని అన్నారు. యేసు క్రీస్తు ప్రభువు ఆశిసులు మీకు ఉంటాయి అని అన్నారు. నేడు ప్రభుత్వం కూడా చదువుకోవటానికి. మంచి అవకాశాలు కల్పించారు అని అన్నారు. ఈ కార్యక్రమం లో మొదటిగా వివిధ గ్రామాలనుండి వచ్చిన బాలబాలికల తో పాటలు, నృత్యంతో అక్కడ హాజరైన భక్తులను హోలరింపజేసారు. క్రిస్మస్ కేకు ను వేదికపైన ఉన్నా పెద్దలు గ్రామ పెద్దలు కట్ట చేశారు. వేదికపైన ఉన్నా ముఖ్య అదితులను శాలువ లతో సత్కరించారు. 2023 క్యాలండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాదర్. సెల్వ రాజు ,గ్రామ మాజీ సర్పంచ్ సరోజినీ , ఎంపీటీసీ కే.రాజు , డి. జెనేష్ మాస్టర్ , పి. అనందయ్య మాస్టర్, ఎం.కోటయ్య మాస్టర్, జ్. సంతోష్ కుమార్, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం ప్రచార సమితి అమరావతి మండల కమిటీ ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్ర పటాల బహుకరణ



**(విన్యూస్, హనుమాన్ జంక్షన్):** బాపులపాడు మండలం పరిధిలో ఉన్న అన్ని గ్రామ సచివాలయాలకు మరియు ప్రభుత్వ కార్యాలయాలకు సమాచార హక్కు చట్టం ప్రచార సమితి అమరావతి మండల కమిటీ ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్ర పటాల బహుకరణ కార్యక్రమంలో భాగంగా సోమవారం సిరివాడ, ఆరుగొలను, ఓగిరాల గ్రామ పంచాయతీ లకు సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కోటా సురేష్ చేతుల మీదుగా అందజేయడం జరిగింది. డాక్టర్ బి.అర్ అంబేద్కర్ చిత్రపటాలని దాతల సహకారంతో అందజేశామని మండల కన్వీనర్ కాలి కిరణ్ బాబు తెలిపారు. దాతల సహకారంతో ప్రచార సమితి ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని దాతల సహకారంతో ఇంకా ఇలాంటి మంచి కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు అక్కినేని రాఘవేంద్రరావు, నూకల శ్రీకాంత్ మరియు ఆయా సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నా క్యాంటీన్ వద్ద అగ్ని ప్రమాదంకు కారణమైన ముద్దాయి అరెస్ట్...



**(విన్యూస్ తెనాలి):** తెనాలి పట్టణంలోని మార్కెట్ ఏరియాలో ముద్దాయి అయిన సూరికొండ సీతారామయ్య.. సైదులు (36) చంద్రబాబు నాయుడు కాలనీకి చెందిన వ్యక్తిగా గుర్తింపు ఇతను తోపుడు బండిపై ఫ్రూట్స్ అమ్ముకుని జీవిస్తూ, మార్కెట్ బిల్డింగ్ వద్దనే ఉంటున్నట్లు, తనకు పరిచయస్తురాలైన, వరుసకు వదిన అయిన తెనాలి మున్సిపల్ మార్కెట్ ఎదురుగా ఉన్న క్యాంటీన్ ముందు రోడ్డు ప్రక్కన పండ్లు అమ్మే సునీత అను ఆమెతో ఉన్న వ్యక్తిగత గొడవలను మనసులో ఉంచుకొని ఆమెకి నష్టం కలుగచేయాలనే ఉద్దేశ్యముతో ది. 17.12.2022 రాత్రి సునీత తన వ్యాపారము ముగించుకుని తనకు సంబంధించిన ఖాళీ ప్లాస్టిక్ ట్రేలను, చెక్క స్టూల్ ను ప్రభుత్వ క్యాంటీన్ భవనంకు ముందు భాగములో ఉన్న ప్రహరీ గోడ వద్ద పెట్టి వెళ్ళగా, ముద్దాయి రాత్రి షుమారు 11.30 గంటల సమయములో మద్యం మత్తులో క్యాంటీన్ వద్దకు వెళ్లి, ప్రక్కనే ఉన్న ఖాళీ ప్లాస్టిక్ ట్రేలను, చెక్క స్టూల్ పైన దానిమ్మ కాయల ప్యాకింగ్ కు వాడే పేపర్ కటింగ్ వేస్టును , వరిగడ్డిని తీసుకుని వాటిపై వేసి, తన వద్దనున్న అగ్గిపెట్టెతో నిప్పు అంటించి అక్కడి నుండి పారిపోయినాడు. మున్సిపల్ కమీషనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేదనలో భాగంగా ముద్దాయిని అదుపులోనికి తీసుకున్నట్లు తెనాలి డిఎస్పి. స్రవంతి రాయి తెలిపారు. ఈ కేసుని అత్యంత త్వరితగతిన సమర్ధవంతంగా చేదించడంలో కృషిచేసిన తెనాలి 1 టౌన్ సి ఐ కే. చంద్ర శేఖర్ , వారి ఎస్ ఐ దేవిడ్ దాస్, సిబ్బంది. ఏ ఎస్ ఐ కే. రత్నరాజు, హెచ్. సి. ఏం. శ్రీనివాసరావు, పి సి, ఎన్. శ్రీనివాసరావులను తెనాలి డి డీఎస్పీడాక్టర్ స్రవంతి రాయ్ ప్రత్యేకంగా అభినందించడమైనది.

Owned by EDITOR and Publisher: PREM NATH THOKALA, 26/152, Buttaipet, Machilipatnam, Krishna Dist.,Printed at Sri Lakshmi Ofset Printer binders, D.no : 32-26-126/13, opp BSNL Bhavan, Chuttagunta, Vijayawada-4. ph:08672 227347.,cell 9848667347 - RNI NO: APTEL/2015/65279